క్లుప్తంగా

రక్తహీనత ప్రమాదకరం


సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

బల్లికురవ: రక్తహీనత లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు మమత, భారతి అన్నారు. రక్తహీనతపై బుధవారం పీహెచ్‌సీలో బ్రోచర్ల ఆవిష్కరణతో రోగులకు అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల తరచూ తలనొప్పి రావడం కళ్లు తిరగడం నిద్ర పట్టకపోవడం, ఛాతీలో నొప్పి, చర్మం పాలిపోతుందని ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారులు కోరారు. రక్తహీనతపై జూలై మూడో తేదీ వరకు పక్షోత్సవాల్లో భాగంగా సబ్‌సెక్టార్ల వారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గుంటుపల్లి పీహెచ్‌సీలో రోగులకు వైద్యం అందుబాటులో ఉందని, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని వైద్యాధికారులు కోరారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం జ్యేష్ఠ మాసం జ్యేష్ఠ నక్షత్రం తచుర్థశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నిరుద్యోగ యువతులకు టైలరింగ్‌లో శిక్షణ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు టైలరింగ్‌లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.మురళి బుధవారం తెలిపారు. పదో తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్, డిగ్రీ చదివిన 35 సంవత్సరాల్లోపు యువతులకు మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. జూలై మొదటి వారంలో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ గుర్తింపు కలిగిన సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని చీరాల, పరిసర ప్రాంత నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

బల్లికురవ: వర్షాకాలం ఆరంభం అయినందున మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సోకే ప్రమాదం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ కోరారు. గురువారం పాతమల్లాయపాలెం గ్రామంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి.. ఉచితంగా మందులును పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులకు, చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని.. దోమకాటు వల్లే సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని చెప్పారు. క్యాంపులో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 2.52 లక్షలు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి 31వ తిరునాళ్ళ మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయానికి వచ్చిన కానుకల వివరాలను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి కానుకలు సమర్పించారన్నారు. దేవాలయానికి విరాళాల రూపంలో రూ. 1.61లక్షలు, దేవస్థానం హుండీ కానుకలు రూ. 90680 వచ్చాయి. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ మేనేజర్లు పి. శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు, వై. సంజీవ పర్యవేక్షించారు.


స్వర్ణలో ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ తల్లి


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కన్నుల పండువగా
స్వర్ణమ్మ తిరునాళ్లు

- వేలాదిగా హాజరైన భక్తులు

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవత, భక్తుల కొంగు బంగారం, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లను మంగళవారం నుంచి బుధవారం వరకు కన్నుల పండువగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ తిరునాళ్లలో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ దేవతగా స్వర్ణమ్మకు గ్రామస్తులు అన్ని శుభ కార్యాలతో ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈ తిరునాళ్లను ఆలయ కమిటీ సభ్యులతో పాటు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతోమ అలంకరించారు. బొగ్గవరపు నిఖితా చౌదరి, సమస్ర చౌదరిల కూచపూడి నృత్యాలు, జానపద నృత్యాలు ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలచాయి. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామ ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కారంచేడు ఎస్సై కె. సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యాలుగా సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.


స్వర్ణమ్మ తిరునాళ్లలో చిన్నారుల కూచపూడి నృత్యాలు


స్వర్ణమ్మ తిరునాళ్లలో నృత్యాలు

ప్రకృతి వనరులు కాపాడుకుందాం

అద్దంకి: ప్రకృతి వనరులను కాపాడుకుందామని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసమూర్తి అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం ఆయన పిల్లలకు సేవ్ ఎనర్జీ అనే అంశాన్ని గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మనకు ప్రకృతి నుంచి సహజవనరులుగా బొగ్గు (నేల బొగ్గు), వివిధ వనరుల నుంచి విద్యుత్, పెట్రోల్, తదితర వనరులు సహజంగా లభిస్తున్నాయన్నారు. ఆయా వనరులను తరగిపోకుండా అందుబాటులో ఉన్న సౌర శక్తిని వినియోగించుకుని వాటిని కాపాడుకోవాలని చెప్పారు. సహజ వనరులతో నడిచే ఇంజన్లను సౌరశక్తితో నడిపించుకుంటే భవిష్యత్ తరాలకు సహజ వనరులను చెక్క చెదరకుండా అందించిన వారం అవడంతోపాటు, కాలుష్యాన్ని తగ్గించినవారం అవుతామని చెప్పారు. భావి భారత పౌరులుగా తయారు కాబోతున్న ప్రతి ఒక్క విద్యార్థి సహజ వనరుల సంరక్షణకు నడుం కట్టాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, కోవి శ్రీనివాసరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, పి. శంకరరావు, నాగేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

ఘర్షణలో ఒకరికి గాయాలు


గాయాలపాలైన ప్రసన్న

బల్లికురవ: మద్యం మత్తులో మాటా మాటా పెరగడంతో ఘర్షణకు దారితీసిన ఘటనలో ఒకరు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి బల్లికురవ మండలంలోని కొప్పరపాడులో జరిగింది. గ్రామానికి చెందిన బుర్రి ప్రసన్న.. కుంచాల రాంబాబుతో తమ ప్రభుత్వం వచ్చింది.. నీ సంగతి తేలుస్తాం అనడంతో ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి రాంబాబును ప్రసన్న దుర్భాషలాడాడు. దీంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో ప్రసన్న తలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె

దొనకొండ: స్థానిక మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ముందు గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. నేడు విద్యార్థులు తరుచూ ఆ ప్రాంతంలో తిరుగుతుంటారు. విద్యార్థులకు ప్రమాదం ఉంటుందని గమనించిన ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు తమ సొంత నిధులతో కంచె ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేస్తారు. ఉపాధ్యాయులు సర్తాజ్ బేగం, ఇనయతుల్లాఖాన్ పాల్గొన్నారు.


కంచె ఏర్పాటు చేయిస్తున్న ప్రభుదాసు

ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి


బహుమతి అందుకుంటున్న దృశ్యం

అద్దంకి: ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈవో గంగాధర్ అన్నారు. పదో తరగతిలో ప్రతిభ చూపి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి గంజ్జల గంగయ్యకు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా గోపాలరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఐదు వేల రూపాయలు బహుమతిగా అందించాడు. ఈ కార్యక్రమం గొరకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్కవరం సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా తమ విద్యా బుద్ధులను మెరుగు పరుచుకునే అవకాశం ఉందన్నారు. తద్వారా బాగా చదివే విద్యార్థులను తయారు చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎంఈవో టూ బూదాటి సుధాకర్‌రావు, రోటరీ క్లబ్‌సభ్యుడు చప్పిడి వీరయ్య, ఆర్‌టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, కరి రవి, పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ముండ్లమూరు: మండలంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం రెండు కోట్ల రూపాయలతో అడిషినల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఈఈ సయ్యద్ అబ్దుల్ కరీం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉమామహేశ్వరపురం, ఈదర సబ్‌స్టేషన్ల పరిధిలో లో ఓల్టేజీ సమస్య ఉన్నందున ఆయా సబ్‌స్టేషన్‌లో నూతనంగా రెండు కోట్ల రూపాయలతో అడిషినల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు సెక్షన్ కార్యాలయం మంజూరు చేసినట్లు చెప్పారు. దీంతో ఇకపై గృహాలకు 24 గంటలు, రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. వర్షాలకు, ఉరుములు, మెరుపులకు విద్యుత్ లైన్లు దెబ్బతింటే సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా లైన్ల కింద చెట్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ఏఈ ఎస్.వీరబ్రహ్మాచారి, సబ్ ఇంజినీర్ కె.ఇమ్మానియేలు బాబు, సిబ్బంది సాంబయ్య, రామాంజనేయులు, కోటేశ్వరరావు, హరికృష్ణ, బిజ్జం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ అబ్దుల్ కరీం

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామి పనులపై టెక్నికల్,ఫీల్డు అసిస్టెంట్‌లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కూలీలు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామసభల ద్వారా గుర్తించిన పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మేట్లను సమన్వయం చేసుకుంటూ పనులు చేయించాలన్నారు. పనులు అడిగిన ప్రతి కూలీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేఅన్నారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రోజుకు రూ.300 కూలీ పడుతుందన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న రామారావు

ఉపాధి కూలీలకు కనీసవేతనం మంజూరు చేయాలి

పీసీపల్లి: ఉపాధి కూలీలకు కనీస వేతనం మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీపీ రామారావు బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూలీలకు కనీస వేతనం ఇవ్వకుండా కోత విధిస్తుందన్నారు. దీంతో కూలీలు ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600, 200 రోజులు పనిదినాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

మజ్జిగ పంపిణీ

చీరాల అర్బన్: ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఎండ తీవ్రతను తట్టుకుని ఉపశమనం పొందేందుకు శీరాం రమేష్ సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలను అసోసియేషన్ సభ్యులు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, శీరాం రమేష్, జి.రమేష్, చెంగలరాయుడు, వెంకటసుబ్బారావు, స్వామి, గుర్రం బదిరి, రఘు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

శిడి మహోత్సవం రేపు


కనకనాగవరపమ్మ అమ్మవారి మూల విరాట్


సిద్ధంగా ఉన్న శిడిమాను

వేటపాలెం: రామన్నపేట శివారులోని పంట పొలాల్లో వేంచేసియున్న భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరుగాంచిన కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం శుక్రవారం జరగనుందని ఆలయ పి. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉచిత మంచినీటి సదుపాయం, అన్నదానం, వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పలు సాంస్కృతిక కార్య క్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి ప్రత్యేక రంగులు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.


రంగులతో అలంకరించిన అమ్మవారి ఆలయం

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

కారంచేడు: ప్రపంచ వ్యాప్తంగా 2047 సంవత్సరం నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలమే లక్షంగా వైద్య ఆరోగ్య శాఖ పనిచేస్తోందని, అందుకు తగినట్లుగా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు-3 గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యాధి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రధానంగా ప్రభావితమయ్యే గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ళ మధ్య వయసున్న సుమారు 7 కోట్ల మంది ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో వివరించారు. రక్తహీనత, కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్ళునొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా అంటువ్యాధులు రావడం, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం (అంగవైకల్యం) వంటివి కనిపిస్తాయన్నారు. గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ఈ వ్యాధి లక్షణాలను అర్థమయ్యేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్స్ వీరమ్మ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, గర్భిణులు, బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కారంచేడులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దశదిన కర్మకు ఎమ్మెల్యే తాటిపర్తి


నారాయణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు మాతృమూర్తి నారాయణమ్మ దశదిశ కర్మకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం హాజరయ్యారు. ముందుగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఆర్థిక సాయం


విద్యార్థిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్నఎంపీపీ కిరణ్‌గౌడ్

యర్రగొండపాలెం: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ బుధవారం ఆర్థిక సాయం అందచేశారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులో ఉన్న రెయిన్‌బో హైస్కూల్లో చదివిన నక్కా రోహిణి టెన్త్‌లో 594/600 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థినికి రూ.38 వేలు, 590/600 మార్కులు సాధించిన పాలకూరు లక్ష్మీదేవికి రూ.24 వేల ప్రకారం ఆయన అందజేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెయిన్‌బో హైస్కూల్ కరస్పాండెంట్ కిషోర్ గౌడ్, ప్రిన్సిపాల్ నిఖిల్ కిరణ్ పాల్గొన్నారు.